క్లుప్తంగా

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: కర్నూలు కళాకారుల సేవా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ప్రకాష్ నగర్‌లో నిరాశ్రయులైన మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా, ఐజోన్ కంటి వైద్యులు డాక్టర్ మహమ్మద్ యూనుస్, బాలశివ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అల్తాఫ్ అహ్మద్, జిల్లా విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురహరి శంకరప్ప, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఉత్సవ్‌కు ప్రభుత్వ సహకారం

కర్నూలు కల్చరల్: కర్నూలు టీజీవీ కళాక్షేత్రంలో నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కర్నూలు ఉత్సవ్ కార్యక్రమానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం సీక్యాంప్ కళాక్షేత్రాన్ని సందర్శించిన ఆయన కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులతో మాట్లాడుతూ.. టూరిజం సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో ఈ అంశంపై చర్చిస్తామన్నారు. స్థానిక అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఉత్సవాల్లో నిర్వహించే కళారూపాలను వివరించారు. సమావేశంలో కళాక్షేత్రం కార్యదర్శి . యాగంటీశ్వర్, ఉపాధ్యక్షులు మహమ్మద్‌మియ్యా తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ప్రధాని నరేంద్రమోదీ సభలో ప్రమాదం వల్ల చనిపోయిన మునగాలపాడుకు చెందిన అర్జున్ కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ నాయకులు అర్జున్ మృతదేహాన్ని ఆసుపత్రిలో చూసి పగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనర్ బాలుడికి రాజకీయ పార్టీలు అంటూ జెండా మోపి ప్రమాదంలో చనిపోయేలా చేశారన్నారు. ఇందుకు ఆ బాలుడిని తీసుకెళ్లిన జనసేన నాయకులను బాధ్యులు చేయాలన్నారు. తన పార్టీ కార్యకర్త చనిపోయినా పవన్ కల్యాణ్ కనీసం పరామర్శించడానికి రాకపోవడం అన్యాయమని మండిపడ్డారు.

పట్టపగలే చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని హెచ్‌పీ గ్యాస్ ఆఫీస్ వద్దనున్న ఓ ఇంట్లో దొంగలు పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. రచ్చకట్ట వీధికి చెందిన యామసాని అనసూయమ్మ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం ఎప్పటిలాగే విధులకు వెళ్లారు. కుటుంబ సభ్యులు పనినిమిత్తం నంద్యాలకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బీరువా పగులగొట్టి అందులోని 3.5 తులాల బంగారం చోరీ చేశారు. ఇంటికి వచ్చి గమనించిన బాధితురాలు చోరీ విషయం గుర్తించి పాణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీమ్ చోరీ జరిగిన ఇంటికి వచ్చి వేలిముద్రలు, వివరాలు సేకరించింది. సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపుతున్నట్లు క్లూస్ టీమ్ సిబ్బంది తెలిపారు. అయితే జనసంచారం ఉండే ప్రధాన వీధిలోనే పట్టపగలు చోరీ జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వెలగని విద్యుత్ లైట్లు



చిన్నటేకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వెలగని విద్యుత్ లైట్లు

కల్లూరు: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారి చిన్నటేకూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఉన్న విద్యుత్ స్తంభాలకు లైట్లు వెలగడం లేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అధికారులు స్పందించి బ్రిడ్జిపై ఉన్న లైట్లు వేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాల అడ్డా

- నగరంలో ప్లాన్‌కు విరుద్ధంగా వాణిజ్య భవనాల నిర్మాణం
- నిర్మాణాల్లో కనిపించని సెట్‌బ్యాక్‌లు, పార్కింగ్ స్థలం
- 100 ఇళ్లకు ఒక ప్లానింగ్ కార్యదర్శి ఉన్నా పర్యవేక్షణ ఏదీ?
- 133 సచివాలయాల పరిధిలో లెక్కలేనన్ని అక్రమ నిర్మాణాలు
- రెండేళ్ల క్రితం గుర్తించిన 1700 భవనాలపై చర్యల్లేవు
- నగర పాలక టౌన్ ప్లానింగ్‌లో అక్రమాలకు అడ్డుకట్ట లేదా?

కర్నూలు నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల ఎదురుగా ఇటీవల ఓ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. ఆ ఏరియా పూర్తిగా కమర్షియల్. గతంలో ఉన్న బిల్డింగ్ స్థానంలో రెనోవేషన్ పేరుతో (పునర్నిర్మాణం) అనుమతులు తీసుకొని మార్పులు చేశారు. అయితే ఆసుపత్రిని ఏర్పాటు చేయాలంటే కనీసం తగినంత పార్కింగ్ సౌకర్యం ఉండాలి. రెనోవేషన్ పేరుతో కర్నూలు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఎలాంటి ఫీజిబిలిటీ లేకుండానే అనుమతులు ఇస్తున్నారు. ఆసుపత్రి వద్ద కనీసం రెండు మూడు ద్విచక్రవాహనాలను నిలిపేందుకు కూడా చోటు లేకుండా ఎలా అనుమతులు ఇస్తారు? రెనోవేషన్ అనుమతులు అంటే నిబంధనలు పాటించకుండా అనుమతులు ఇచ్చేయొచ్చా? నిబంధనలు పాటించకుండా అనుమతులు ఇస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. మరి చర్యలు తీసుకోరా.?



ఎస్‌టీబీసీ కళాశాల సమీపంలో పార్కింగ్ సౌకర్యం లేకుండా ఏర్పాటు చేసిన ఆసుపత్రి

కర్నూలు నగరంలోని ఐటీసీ సర్కిల్ సమీపంలో ఓ వాణిజ్య భవనం నిర్మిస్తున్నారు. పూర్తిగా వాణిజ్య భవనం అది. కింద 6 షాపులు, పైన అదే స్థాయిలో షాపులు నిర్మించారు. రెండవ అంతస్తులోనూ ఇదే స్థాయిలో షాపులు కడుతున్నారు. మరి వాణిజ్య భవనంలో ఈ స్థాయిలో షాపులు కడితే అక్కడికి వచ్చే వాహనాలు ఎక్కడ పెట్టాలి. నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలం చూపించాలి కదా? అనుమతులు తీసుకునే ముందు ప్లాన్‌లో పార్కింగ్ చూపించాలి. మరి అక్కడ ఎలాంటి పార్కింగ్ లేకుండానే అనుమతులు ఏలా ఇస్తారు. మరి ఏం జరిగింది. ఆ ఏరియా ప్లానింగ్ కార్యదర్శికి, టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ ఏం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదు. ప్రజలు రోడ్ల మీదే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలా?



కృష్ణానగర్ ఐటీసీ సమీపంలో పార్కింగ్ సౌకర్యాం లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య భవనం



నగరపాలక సంస్థ కార్యాలయం

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో నివాస, వాణిజ్య, అపార్టుమెంటు నిర్మాణాలు ఏవైనా సరే.. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు తప్పనిసరి. దీనివల్ల ఎవరికి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ సమస్య రాకుండా, పార్కింగ్ సమస్య తలెత్తకుండా పక్కాగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు చేపడితే ఎలాంటి సమస్య ఉండదు. అయితే నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. అక్రమాలకు తెరతీస్తున్నారు. నగరంలోని శివారు కాలనీలలోనే కాకుండా నగర నడిబొడ్డున అక్రమ వాణిజ్య నిర్మాణాలు వెలుస్తున్నాయి. రెసిడెన్షియల్ నిర్మాణాలతో పాటు వాణిజ్య సముదాయాల్లోనూ అదే స్థాయి అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన రహదారుల్లో నిర్మించే బహుళ అంతస్తుల వాణిజ్య సముదాయాల్లోనూ నిబంధనలు ఖాతరు చేయడం లేదు. అనేక నిర్మాణాల్లో పార్కింగ్ స్థలాలను వదలడం లేదు. సెల్లార్ పార్కింగ్ లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీద వాహనాలు నిలిపితే ట్రాఫిక్ పోలీసులతో సమస్య వస్తుంది. ఫొటో తీయడం రూ.500 నుంచి రూ.1000 చలానా చేతిలో పెడుతున్నారు. నిర్మాణాలు చేపట్టేటప్పుడు టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించి ప్రతి సచివాలయ పరిధిలో 100 ఇళ్లకు ఒక ప్లానింగ్ కార్యదర్శి ఉన్నారు. కర్నూలు నగరంలోని 133 సచివాలయాలకు 133 మంది ప్లానింగ్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నా అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శికి కేటాయించిన 100 ఇళ్లను ఉదయం ఒకసారి సాయంత్రం ఒకసారి పర్యవేక్షణ చేస్తే చాలు. అక్రమ నిర్మాణాలను సులువుగా గుర్తించవచ్చు. అయితే పర్యవేక్షణ లేక నగరంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కొంతమంది ప్లానింగ్ కార్యదర్శులు, సర్వేయర్లు, లైసెన్సుడ్ ఇంజినీర్లు నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అవినీతి పెరిగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత కమిషనర్ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెమోలు ఇస్తున్నారు. చర్యలు తీసుకుంటామని పదే పదే హెచ్చరిస్తున్నారు. అయినా టౌన్ ప్లానింగ్ సిబ్బంది మాత్రం తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది.

విజిలెన్స్ అధికారులు పట్టించుకోరా..!

కర్నూలు నగరం అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా మారుతోంది. అనుమతి ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అనేక నిర్మాణాల్లో నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. అక్రమ భవనాలపై సంబంధిత టౌన్ ప్లానింగ్ నుంచి ఫైల్స్ పరిశీలిస్తే విజిలెన్స్ అధికారులకు వాస్తవాలు తెలుస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రెండేళ్ల క్రితం గుర్తించిన అక్రమ భవనాలపై చర్యలేవీ?

రెండేళ్ల క్రితం నగరపాలక అధికారులు టౌన్ ప్లానింగ్‌పై వచ్చిన ఆరోపణలు, విమర్శల నేపథ్యంలో అక్రమ భవనాలు, అనుమతులు లేని భవనాలపై పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అప్పట్లోనే 1700 ఇళ్లకు అనుమతులు లేకపోవడం, డీవియేషన్, ఒక ఫ్లోర్‌కు అనుమతి తీసుకొని రెండు అంతస్తులు నిర్మించడం, నిర్మాణాల్లో నిబంధనలు పాటించకపోవడం, వాణిజ్య నిర్మాణాల్లోను సెట్‌బ్యాక్‌లు లేకపోవడం, పార్కింగ్ స్థలం లేకుండా వందల సంఖ్యలో నిర్మాణాలు చేపట్టిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వీరందరికీ నోటీసులు జారీ చేశారు. అంతే.. అప్పటి నుంచి ఏలాంటి చర్యలు లేవు. ఫైల్‌ను మూసేశారు. ఇలా ఎన్ని అక్రమాలు చేసినా... పట్టించుకోరన్న అభిప్రాయం నిర్మాణాదారుల్లో ఉంది. అందుకే ప్రధాన రహదారుల్లోనూ 30 అడుగుల రోడ్డు లేకున్నా యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. అనేక చోట్ల పార్కింగ్ స్థలాలను బాడుగకు ఇచ్చారు. ప్లాన్‌లో పార్కింగ్ చూపించి నిర్మాణాలు చేపట్టడం చేస్తున్నా... తమకేమీ సంబంధం లేన్నట్లు ఆ విభాగం యంత్రాంగం వ్యవహరిస్తుందన్న విమర్శలు ఉన్నాయి.

మోదీకి స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

కర్నూలు: జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కలెక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ స్వాగతం పలికారు. గురువారం ఉదయం ప్రత్యేక విమానంలో మోదీ ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ ఆయనకు ఘన స్వాగతం పలికారు.



ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కోటి సంతకాల సేకరణను జయప్రదం చేయండి



కోట్ల హర్ష, ఆదిమూలపు సతీష్‌ను సత్కరిస్తున్న వెంకటగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా ఎంపికైన కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను గురువారం కోడుమూరు మండలంలోని వెంకటగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోట్ల హర్ష మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలంతా కలిసికట్టుగా ప్రజలకు అండగా పోరాడాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో గ్రామగ్రామాన నిర్వహించి ప్రజల నుంచి సంతకాలను సేకరించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కురువ గిరిబాబు, మహేశ్వరరెడ్డి, బీసీ రామక్రిష్ణ, మద్దిలేటి, డాక్టర్ గిడ్డయ్య, హనుమంతు, శివ, గిడ్డయ్య, భీముడు, మాదులు, మధు, ఆర్‌కే రామక్రిష్ణ, రాముడు, గంగాధర్, రామగిడ్డయ్య, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు కోటి సంతకాలసేకరణ కార్యక్రమం

కల్లూరు: రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని శుక్రవారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కార్యాలయం నుంచి ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరూ పాల్గొని మద్దతు తెలుపలని కోరారు.

రోడ్డుపై గుంత.. ప్రయాణికుల చింత

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు నుంచి రెమదూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంతలు ఉన్నాయి. ఈ రోడ్డుపై అనుగొండ నుంచి పుసులూరు, బస్తిపాడు మీదుగా కర్నూలుకు ప్రజలు ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై గుంతలు ఉండడం వల్ల ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల పక్కనే వ్యవసాయ పొలాల ఉన్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు వెళ్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేయాలని ఆయా గ్రామ ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



బస్తిపాడు-రెమదూరు మార్గంలో ఉన్న గుంతలు

ముళ్లపొదల్లో వీరశైవ రుద్రభూమి

- దేవుని మాన్యం ఉన్నా శ్మశాన నిర్వహణ సున్నా
- పట్టించుకోని ఆలయ నిర్వహణ కమిటీ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని వీరశైవ రుద్రభూమికి వెళ్లే దారి మొత్తం ముళ్లకంచెలతో నిండిపోయింది. రుద్రభూమికి వెళ్లే దారి మూసుకుపోయింది. ఎవరైనా చనిపోతే తప్ప ముళ్లకంచె తొలగించే పరిస్థితి లేదు. దేవదాయ శాఖ పరిధిలో పత్తికొండలోని పాతపేటలో పురాతన వీరభద్రస్వామి ఆలయానికి ఇనాం భూమి పత్తికొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 50 ఎకరాల వరకు ఉండేది. సర్వేనెం: 219/1లో సుమారు 10.85 ఎకరాలు ఉంది. ఇందులో ఆర్టీసీ డిపోకు 5 ఎకరాలు, వీరశైవులతో పాటు పేదలకు ఇంటినివేశ పట్టాల కోసం 3 ఎకరాలు పంపిణీ చేశారు. మిగిలిన 2.85 ఎకరాల్లో వీరశైవ రుద్రభూమిగా ఉంది. మరో చోట 12 ఎకరాల భూమిని కొన్నేళ్ల క్రితమే చేనేతల నివాస గృహాల కోసం ఇంటి పట్టాలను అందజేశారు. మలకలకుంట, పుచ్చకాయల మాడ గ్రామ పొలాల్లో, చెరువుకట్ట సమీపంలో స్వామి వారి ఇనాం భూమి ఉంది. ప్రస్తుతం దూపదీప నైవేద్యాలు, స్వామివారికి కైంకర్యాలు నిర్వహిస్తున్న వారు మిగిలిన భూమిని సాగుచేసుకుంటున్నారు. జంగమ, బలిజ, లింగాయతి, లాలిగండ్ల రెడ్లకు చెందిన సుమారు వంద కుటుంబాలు ఉన్నాయి. వీరిలో ఎవరు మృతి చెందినా ఈ శ్మశాన వాటికలోనే దహన సంస్కారాలు చేయడం ఆనవాయితీ. అయితే కొన్ని నెలలుగా మరుభూమి మొత్తం ముళ్లకంచెలతో నిండిపోయింది. దేవుని మాన్యం ఉన్నా ఆలయ నిర్వహణ కమిటీ పట్టించుకోకపోవడంతో శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఏపుగా ముళ్లపొదలు పెరిగిపోయాయి.ఇప్పటికైనా రుద్రభూమిలో సౌకర్యాలు కల్పించి శ్మశాన వాటికలో అసౌకర్యాలు తొలగించాలని వీరశైవులు కోరుతున్నారు. ఈ విషయంపై దేవాలయ ధర్మకర్త మల్లికార్జునస్వామిని వివరణ కోరగా ఇప్పటి వరకు దేవదాయ శాఖ నుంచి రూపాయి కూడా డ్రా చేయలేదని, నిర్వహణ మాత్రం తమే చూసుకుంటున్నామని చెప్పారు. నిర్వహణ కమిటీతో చర్చించి రుద్రభూమిలో అసౌకర్యాలు తొలగించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని వివరించారు.



పత్తికొండలో ముళ్లపొదలతో నిండిన రుద్రభూమి

కాలనీలకు మట్టి రోడ్లే దిక్కు

- మౌలిక వసతులకు నోచుకోని కాలనీలు
- వర్షాలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం కల్లూరు అర్బన్ 21వ వార్డులోని సంస్కృతి పార్కు ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి కొంత దూరం ప్రయాణిస్తే వస్తుంది. ఈ రోడ్డు మహాలక్ష్మినగర్ నుంచి నంద్యాల రోడ్డును కలిపే వంద అడుగుల రోడ్డు పక్కన ఉంటుంది. ఈ రోడ్డుపై డాక్టర్స్ కాలనీ, మహాలక్ష్మీనగర్, పార్థసారథి నగర్, తదితర కాలనీ ప్రజలు ప్రయాణిస్తుంటారు. మట్టి రోడ్డు కావడంతో రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.



మహాలక్ష్మినగర్, పార్థసారథి నగర్‌లో ఉన్న మట్టి రోడ్డు దృశ్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం కల్లూరు అర్బన్ 19వ వార్డు గణేష్‌నగర్‌లోనిది. కర్నూలు నగరపాలక సంస్థలో పెద్ద వార్డు. అయితే అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. కనీసం కాలనీలో మౌలిక వసతులు కూడా సరిగా లేవని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డే కాదు కల్లూరు అర్బన్ 16 వార్డులలో చాలా కాలనీలలో ఇంకా మట్టి రోడ్లు ఉన్నాయి. వీకర్ సెక్షన్ కాలనీ, ముజఫర్ నగర్, పందిపాడు ఇందిరమ్మ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, మహాలక్ష్మినగర్, నాగేంద్ర నగర్ తదితర కాలనీలో రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు. మట్టి రోడ్లు గుంతలమయంగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. రోడ్లను బాగు చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



19వ వార్డు గణేషనగర్‌లో దర్శనమిస్తున్న మట్టి రోడ్డు

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ, గ్రామీణ ప్రాంతాల రోడ్లు బాగు చేస్తామని వాటిని అద్దంలా తళతళమెరిసేలా చేస్తామని నాయకులు ప్రగాల్భాలు పలికారు. ప్రభుత్వం ఏర్పడి సుమారుగా 16 నెలలు దాటినా ఇప్పటికీ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇంకా మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి.

కర్నూలు నగరపాలక సంస్థలో మొత్తం 52 వార్డులు ఉన్నాయి. అందుల్లో 16 వార్డులు కల్లూరు అర్బన్ పరిధిలో ఉన్నాయి. 16 వార్డులలో సుమారుగా 2.5 లక్షల మంది జనాభా ఉన్నారు. అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోంది. మున్సిపాలిటీకి అధిక ఆదాయం వివిధ రకాల పన్నుల రూపేన 16 వార్డుల నుంచే వస్తుంది. మున్సిపాలిటీ అధికారులు పన్నులు అయితే సకాలంలో వసూలు చేస్తున్నారు కానీ కాలనీలలో మౌలిక వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా కల్లూరులోని కాలనీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు మట్టి రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఆయా కాలనీల ప్రజలు వాపోతున్నారు.





తెలికాంనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, పందిపాడు ఇందిరమ్మ కాలనీలో బురదమయంగా రోడ్డు

భయపెట్టి, బెదిరించి సభకు తరలింపు





కోడుమూరు నుంచి ప్రధాని సభకు ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేసిన బస్సు,సి.బెళగల్ మండలంలో గ్రామాలకు కేటాయించిన బస్సులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

కోడుమూరు రూరల్: కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు కోడుమూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలను భయపెట్టి, బెదిరించి తరలించారు. మండలానికి 110కి పైగా బస్సులను కేటాయించి పొదుపు మహిళలు, ఉపాధి గ్రూపులకు చెందిన కూలీలు తప్పనిసరిగా రావాలంటూ లేకపోతే రుణాలు రావు, జాబ్ కార్డులు రావంటూ భయపెట్టడంతో చేసేది లేక ప్రజలు మోదీ సభకు తరలివెళ్లారు. కాగా కొన్ని గ్రామాల నుంచి నాయకులు ఊహించినంత జనాలు రాకపోవడంతో చాలా బస్సులు పూర్తిగా నిండకుండానే బయలుదేరి వెళ్లాయి.

ఎంపీడీఓ పర్యవేక్షణ

సి.బెళగల్: మండలం నుంచి ప్రధాని నరేంద్ర మోదీ సభకు ప్రజల తరలింపును ఎంపీడీఓ రాణెమ్మ పర్యవేక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలను బస్సులలో తరలించే కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె ఆయా శాఖల మండల అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో కలిసి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బస్సు పాయింట్‌ను స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్‌తో కలిసి ఎంపీడీఓ తనిఖీ చేసి, ఆయా గ్రామాలకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఉపాధిహామి ఏపీఓ రామన్న, వ్యవసాయ అధికారులు తమ సిబ్బందితో కలిసి గ్రామాల్లో ప్రజలను సభకు తరలించారు.

19న 'మాతృదర్శనం' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ప్రముఖ పద్య కవి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత చేగిరెడ్డి చంద్రశేఖర రెడ్డి రచించిన 'మాతృదర్శనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని రచయిత తెలిపారు. తెలుగు భాష వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర కల్కూర పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు.

19న హరికథా గానం

కర్నూలు కల్చరల్: సాంప్రదాయ కళలను బతికించుకుందాం అనే నేపథ్యంలో ఈనెల 19వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో టీటీడీ ఆస్థాన హరికథకురాలు లక్ష్మీ మహేష్‌చే హరికథా గానం ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 'శ్రీకృష్ణ రాయబారం' అనే అంశంపై ఆమె హరికథా గానం చేస్తారని పేర్కొన్నారు.